
కథ

ఆ రోజు అక్టోబర్ 29.

ఉదయమే విచారంతో నిద్రలేచాడు రాజేష్. జవాను వచ్చి టీ ఇచ్చాడు. "అయ్యగారూ! శాస్త్రులు గారొచ్చారు. ఇంకా బ్రాహ్మడు దొరకలేదట" అన్నాడు జవాను.



# కర్మకాండ

— సి. ఎస్. రావ్

3/3/91

"అలాగా!" ముఖం బాధగా పెట్టాడు రాజేష్.

శాస్త్రులు లోనికొచ్చాడు.

"అయ్యా! ఒక పని చెయ్యండి. ప్రక్కింటిలో వుంటున్న ఆఫీసరుగారు చాలా మంచివారు. ఆయన్ని భోజనానికి పిలిస్తే ఏమనుకోరనుకుంటాను" అన్నాడు శాస్త్రులు.

ఆయనతో కేవలం నెల్లాళ్ళ క్రితమే రాజేష్‌కి బస్సులో పరిచయమైంది. తనింట్లో జరిగే ఇలాంటి కార్యక్రమానికి వస్తాడో రాడో అని సందేహించాడు రాజేష్.

'ఐనా పిలిచి చూద్దాం, తప్పేముంది' అనుకున్నాడు.

ప్రక్కింటికి వెళ్ళి తలుపు తట్టాడు. కుమార్ వచ్చి తలుపు తీశాడు. విషయాన్ని వివరించాడు రాజేష్.

"కుమార్‌గారూ! తప్పనిసరై మిమ్మల్ని పిలవవలసి వచ్చింది. మీరు మరోలా భావించరని నా ఆశ. ఈ రోజుకి నా భార్య మరణించి రెండేళ్ళయింది. ప్రతి ఏడూ శాస్త్రయుక్తంగా కర్మ జరుపుతున్నాను. కాని ఈ ఏడాది అలా కుదరలేదు. తానంటే నాకు ప్రాణం. అందుకే ఏదో వీలైనంతలో సరి పెడుతున్నాను. మీరు తప్పకుండా భోజనానికి రావాలి" బ్రతిమలాడాడు రాజేష్.

భార్య పట్ల రాజేష్‌కున్న ప్రేమను తెలుసుకుని యాంత్రికంగా నవ్వాడు కుమార్.

"అలాగేనండీ. తప్పకుండా వస్తాను."

"పాప లిద్దర్నీ కూడా తీసుకురండి" అన్నాడు రాజేష్.

"పాప లిక్కడ లేరండి. ఎప్పుడూ వాళ్ళమ్మతో కలిసి తాతగారింట్లో వుంటారు. అమ్మని వదిలి ఒక్క క్షణం వుండరు. ఆమె సవతి తల్లయినా కన్నతల్లి కంటే ఎక్కువ నా పిల్లలకు" చిరునవ్వుతో అన్నాడు కుమార్.

అతని అదృష్టానికి మనసులోనే అసూయ పడ్డాడు రాజేష్.

రాజేష్ వెళ్ళిపోయాడు. తలుపు వేసుకుని మళ్ళీ మంచం మీద పడుకుని తలగడలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు కుమార్.

రెండు సంవత్సరాల క్రితం—

"ఏరా! మనింట్లో ఆడదిక్కు లేకపోతే గడిచే దెలాగరా! నేనా ముసలివాణ్ణైపోయాను. మీ అమ్మ నాకన్యాయం చేసి స్వర్గస్తురాలైంది. దేవత లాంటి నా కోడలు నిన్నూ నీ ఇద్దరు పిల్లల్నీ అన్యాయం చేసి పర లోకానికి వెళ్ళిపోయింది. నువ్వు ఎవరినో ఒకరిని పెళ్ళి చేసుకుని ఈ ఇంటికి తీరుతెన్నులు తేకపోతే నీ కూతుళ్ళని పెంచి పెద్దచేసేది, పెళ్ళిళ్ళు చేసేది ఎవ్రరా? ఎంతసేపూ నీ ఆఫీసు విషయాలే గాని, ఇంటి విషయం పట్టించుకోకపోతే ఎలాగరా?" బాధగా అన్నాడు కుమార్ తండ్రి.

"ఈ వయసులో నన్నెవరు చేసుకుంటారు నాన్నా! నా వయసు నలభైనాలుగు. ఇంకో నాలుగేళ్ళలో నా పెద్దకూతురికి పెళ్ళి చేయాల్సినవాణ్ణి. ఇప్పుడు నేను పెళ్ళి పీటల మీద కూచోనా" సీరియస్‌గా ఆలోచిస్తూ అన్నాడు కుమార్.

"నువ్వొప్పుకోవాలే గాని కో అంటే కోటి మందున్నారు. నువ్వు సరే అను ముందు" హెచ్చరికగా అన్నాడు కుమార్ తండ్రి.

చేసేది లేక సరేనన్నాడు కుమార్. అను కున్నట్టుగానే ఒక సంబంధం కుదిరింది. అమ్మాయికి నలభై ఏళ్ళు. మదురైలో ఉద్యోగం. పెళ్ళికి షరతు మాత్రం ఒక టుంది. "నేను ఉద్యోగం మాత్రం మానను. నెలకు పదిహేను రోజులు మదురైలో ఉద్యోగం చేస్తాను" అంది కాబోయే తన ఇల్లాలు నాగరమణి. అందుకు అందరూ అంగీకారం తెలిపారు.

"మన పెళ్ళి ఎవరికీ తెలియకుండా తమిళనాడులో రిజిస్ట్రార్ ఆఫీసులో చేసుకుందాం. పెళ్ళి చేసుకుంటున్నామని పబ్లిసిటీ ఎందుకు?" అంది నాగరమణి.

"అదెలాగమ్మా! సాంప్రదాయకమైన కుటుంబంలో పుట్టి వేద మంత్రాలు లేకుండా పెళ్ళేమిటి? అంతగా పెళ్ళికి ఎవర్నీ పిలవద్దనుకుంటే శ్రీపతిగిరి మీద సింపుల్‌గా చేసుకోండి" అన్నాడు కుమార్ తండ్రి.

పెళ్ళి జరిగింది. మొదటి నెల పక్షం రోజులు ఆంధ్రాలో భర్తతో వైవాహిక జీవితం ఆనంద డోలికలాడింది. మిగిలిన పక్షం రోజులు మదురైలో ఉద్యోగంలో గడిచాయి.

నాగరమణి వెళ్ళిన దగ్గర్నుంచీ పక్షం రోజులు ఎప్పుడు గడుస్తాయా అని ఎదురుచూశాడు కుమార్.

"ఇంకో ఎనిమిది నెలల వరకు నేను రాను. నాకిప్పుడు రెండో నెల" అని నాగరమణి ఉత్తరం రాసింది.

పెళ్ళయిన నెల్లాళ్ళకే నాగరమణికి రెండో నెలా? సత్సాంప్రదాయకమైన కుటుంబంలో పుట్టి పెరిగిన కుమార్ గుండె బ్రద్దలైంది. ఎలాగో నిబ్బరం తెచ్చుకున్నాడు. 'ఐనా నా వయసులో రెండో పెళ్ళివాడికి మహా పతివ్రత కావాలనుకోవడం దురాశ కాదూ?' అని సరిపెట్టుకున్నాడు.

"నా ప్రియమైన రమణీ! శుభవార్త తెలిసి ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యాను. నాకిద్దరూ ఆడపిల్లలే. నువ్వయినా నాకు బాబుని నిస్తావని ఆశిస్తున్నాను. నీ ఆరోగ్యం జాగ్రత్త" అని ఉత్తరం రాశాడు కుమార్.

గర్భవతియైన తన భార్యకి ముద్దు ముచ్చటలు చేసుకోవాలని మదురై వెళ్ళాడు కుమార్. ఇంటి తలుపు తీసేసరికి తన కళ్ళముందు కనిపించిన దృశ్యాన్ని చూసేసరికి దిగ్భ్రాంతుడై భయంతో వణికాడు కుమార్. పరాయి పురుషుని వెచ్చటి కౌగిల్లో తన భార్య నాగరమణి.

కష్టం మీద విషయం అర్థమైంది. నాగరమణి మాజీ ప్రియుడు పిళ్ళే. ఏడాది క్రితం అమెరికా వెళ్ళాడు. అతను తిరిగి రాడని నిర్ధారించుకుని కోటీశ్వరుడైన కుమార్‌తో పెళ్ళికి ఒప్పుకుంది. తీరా ముహూర్తం పెట్టాక పిళ్ళే తిరిగివచ్చాడు. పిళ్ళే పరభాషా వ్యక్తి. అందులోను కులం వేరు. అతనితో పెళ్ళికి అవకాశం లేకపోయింది. అలాగని అతన్ని వదులుకోలేక పోయింది. కాని కోటీశ్వరుడైన కుమార్‌కి ఏ సమాధానం చెప్పలేక ఉద్యోగం వదలనే షరతు మీద పెళ్ళికి ఒప్పుకుంది. ఇద్దరితోనూ రెండు రాష్ట్రాల్లో హాయిగా జీవితాన్ని పంచుకుంది నాగరమణి.

తల్చుకున్నకొద్దీ కుమార్‌కి రక్తం గడ్డ కడుతోంది. మనసు దహించుకుపోతోంది. బాధని కక్కలేక మింగలేక మనోవ్యథతో కుమిలిపోయాడు.

లేచి స్నానం చేసి బట్టలు వేసుకుని రాజేష్ ఇంటికి భోజనానికి వెళ్ళాడు కుమార్.

రాజేష్ ఇల్లు చాలా అందంగా వుంది. ఆ ఇంటి వాతావరణం, టేప్ రికార్డర్‌లోంచి వస్తున్న శాస్త్రీయ సంగీతం కుమార్ కెంతగానో నచ్చాయి. అక్కడి వాతావరణం తన బాధకి పరిష్కారం చూపించకపోయినా తన బాధని కొంతసేపు మరిచిపోవడానికి దోహదం చేశాయి.

కర్మకాండ మొదలైంది. శాస్త్రులు మంత్రాలు చదువుతున్నారు. యథావిధిగా రాజేష్ తతంగం జరుపుతున్నాడు.

ఆ రోజుకి తన పెళ్ళయి సరిగ్గా రెండేళ్ళయింది. పెళ్ళిరోజున భార్యతో ఆనందంగా గడపవలసిన సమయంలో మరొకడి భార్య శ్రాద్ధకర్మకి వెళ్ళే యోగం పట్టింది కుమార్‌కి. పగవాళ్ళకి కూడా ఆ నరకం వద్దనిపించింది.

కర్మకాండ పూర్తయింది. భోజనాలకు కూర్చున్నారు. రాజేష్ ముఖం విచారగ్రస్తమైంది. అన్నం సహించడం లేదు. కన్నీళ్ళు బలవంతాన ఆపుకుంటున్నాడు రాజేష్. అతన్నెలాగో మరిపించాలని అతన్ని మాటల్లో పెట్టాడు కుమార్.

"ఇంత చిన్నతనంలో మీకు భార్యా వియోగమంటే... ప్చ్! నాకూ బాధగా వుంది" భోజనం చేస్తూ అన్నాడు కుమార్.

రాజేష్ మౌనం వహించాడు.

"చూడండి! మీ వయసింకా ఏం మించి పోలేదు. నాలాగే మీరూ రెండో పెళ్ళి చేసుకుని సుఖపడకూడదూ?" స్నేహపూర్వకంగా అన్నాడు కుమార్.

"శాస్త్రం కోసం కాదు. నా తృప్తి కోసం. ఏ గుండెలమీద ఆమెనొక పసిపాపలా లాలించానో ఆ గుండెల్లోనే చిచ్చుపెట్టి నా హృదయేశ్వరి పరాయి సొమ్మయిందంటే భరించ లేకపోతున్నాను. అందుకే ఆమె చచ్చి నాలో కలిసిపోయిందనే తృప్తి పొందడానికే ఈ తతంగమంతా!" బాధని బలవంతాన ఆపుకున్నాడు రాజేష్.

"మైగాడ్!" ఆశ్చర్యపడ్డాడు కుమార్.

కొంతసేపు మౌనం. ఆ మౌనాన్ని ఛేదిస్తూ రాజేష్ భుజం తట్టాడు కుమార్. కన్నీళ్ళు రుమాలుతో తుడుచుకుంటూ అతనివైపు చూశాడు రాజేష్.

"ఆ మాటకొస్తే నాకన్నా పెద్ద కష్టం కాదు మీది. ఇద్దరు ఆడపిల్లల్ని నన్ను అన్యాయం చేసి పదిహేనేళ్ళు నాతో కాపురం చేసిన నా భార్య చనిపోయింది. మళ్ళీ పెళ్ళి చేసుకుని దేవత లాంటి రెండో భార్యతో హాయిగా కాలం గడుపుతున్నాను. మీరూ అలా చెయ్యండి" స్నేహితుడిగా సలహా ఇచ్చాడు కుమార్.

"చెప్పినంత సులభం కాదండీ చెయ్యడం."

"ఎందుక్కాదు? చూడండి! వయసులో మీకన్నా పెద్దవాణ్ణి కాబట్టి చెబుతున్నాను. ఈ జీవితం ఒక పెద్ద కల. మీ జీవితంలో ఒక కల కరిగిపోయింది. భవిష్యత్తు కోసం మరో మంచి కల గంటూ జీవితాన్ని గడపాలి. మీ జీవితంలో మీ ప్రియురాలు కేవలం ప్రియురాలిగానే మిగిలిపోయింది. ఇల్లాలు కాలేకపోయింది. ఇప్పటికీ ఆమెను ప్రియురాలిగానే భావిస్తూ ఆమెతో స్నేహ సంబంధాలు పెట్టుకుంటే క్రమంగా మీ బాధని కొన్నాళ్ళకి మరిచిపోగలరు. అందుకు నేను పూనుకుంటాను" ధైర్యం చెబుతూ అన్నాడు కుమార్.

"ఆమె చనిపోతే ఆపనే చేసేవాణ్ణేమో!" అన్నాడు రాజేష్.

కుమార్ నిర్ఘాంతపోయాడు. చేతిలోని గారెను ఆకులో పారేసి రాజేష్‌వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"మీరనేది?"

"అవునండీ. ఆమె చనిపోలేదు. నేను చేస్తున్న ఈ శ్రాద్ధకర్మ చనిపోయిన నా భార్యకి కాదు. నాతో పన్నెండేళ్ళు ప్రేమ నటించి పరాయి సొమ్మయిన నా ప్రియురాలికి" విచారంగా అన్నాడు రాజేష్.

"ప్రియురాలు బ్రతికుండగానే ఈ కర్మకాండ ఏమిటండీ! శాస్త్రం ఒప్పుకుంటుందా?"

"కుమార్‌గారూ! నా బాధని ఈ జన్మలో నేను మరిచిపోలేను. కాని ఒక చిన్న కోరిక వుంది. ఆమె నాకు పరాయిదైనా, ఆమెను ఒకసారి దూరం నుంచైనా చూసి తృప్తిపడాలని ఆశగా వుంది" దీనంగా అన్నాడు రాజేష్.

"చెప్పండి- ఆవిడెక్కడున్నారో. నేను చూపించే ఏర్పాట్లు చేస్తాను" విశ్వాసంగా అన్నాడు కుమార్.

"మదురైలో. పేరు నాగరమణి."